సాక్షి నంద్యాల

ఆదివారం । 28 । జూలై । 2024



రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో 16 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



నల్లమల టైగర్'

తెలుగు రాష్ట్రాల్లోని నల్లమల అడవులు పులి సంరక్షణకు ఆశ్రయ దుర్గంగా మారాయి. పులి ప్రవర్ధనానికి ఈ ప్రాంతం అత్యంత అనుకూల పర్యావరణాన్ని కలిగి ఉంది.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.68
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:100.523
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,03,676
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,17,571

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట



ఆలయ ఆవరణలో భక్తులు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి ఆషాడ మాసం శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. భక్తులు స్వామి వారికి వివిధ సేవలు నిర్వహించుకోవడంతో శనివారం ఒక్క రోజు రూ.3,21,561 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

ప్రతి ఉద్యోగి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలి



ఉద్యోగులకు చెక్కును అందిస్తున్న ఆర్‌ఎం రజియా సుల్తానా

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఉద్యోగి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆర్‌ఎం రజియా సుల్తానా అన్నారు. నంద్యాల ఆర్టీసీ డిపోలో జూన్ మాసంలో ఆర్టీసీ డిపోకు అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్లకు శనివారం డిపో ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారిణి రజియాసుల్తానా హాజరై ఉద్యోగులను అభినందించి ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కండక్టర్లు మల్లికార్జున, రాయుడు, శేషన్న, రాజు, డ్రైవర్లు హుస్సేన్, వలి, ప్రసాద్, పీఎం రావ్, కాశీం, స్వామిలను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎం గంగాధర్‌రావు, మద్దిలేటి నాయుడు, విజయకుమార్ తదితర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): పాలిసెట్ – 2024 కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ ఆటో మొబైల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటలర్జికల్, ఇంజినీరింగ్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వివిధ డిప్లొమా కోర్సుల్లో 30 ఖాళీ సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటా కింద 18 ఖాళీ సీట్లు మిగిలాయని తెలిపారు. పాలిసెట్– 2024 పరీక్షకు హాజరైన వారితో పాటుగా హాజరు కాని వారు కూడా ఈ స్పాట్ అడ్మిషన్‌లో పాల్గొని సీటు పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువీకరణ పత్రాలతో 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకోవాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ప్రభుత్వ పరంగా ఎటువంటి స్కాలర్‌షిప్‌లు రావని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9440021417, 9912377723ను సంప్రదించాలన్నారు.

బ్యాంకాక్‌లో జిల్లా యువకుడి కిడ్నాప్



పూసలపాటి మధుకుమార్ (ఫైల్)

డోన్ రూరల్: చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన దొరపల్లి పెద్ద సుంకన్న కుమారుడు పూసల పాటి మధుకుమార్‌ను బ్యాంకాక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు డోన్ రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మధుకుమార్ బెంగళూరులో ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగ విధుల్లో భాగంగా ఈనెల 22వ తేదీన థాయ్‌లాండ్ దేశ రాజధాని బ్యాంకాక్ వెళ్లారు. 25వ తేదీన మధుకుమార్ సెల్ నుంచి 'బ్యాంకాక్‌లో తనను కిడ్నాప్ చేశారని, రూ.8లక్షలు ఇస్తే వదిలేస్తామని, లేక పోతే చంపుతామని బెదిరిస్తున్నారని అతని సోదరి రాజ్యలక్ష్మి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అనంతరం అతడి సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో యువకుడి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో వారు శనివారం డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అబ్రహత్‌బాషా తెలిపారు.

'వనిత'ర సేద్యం

- పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతుల ఆసక్తి
- సేంద్రియ పద్ధతుల్లో వరి, కూరగాయల సాగు
- జిల్లాలో ఏటేటా పెరుగుతున్న సేంద్రియ సాగు విస్తీర్ణం
- దిగుబడులకు 10 నుంచి 15 శాతం అదనంగా మద్దతు ధర
- 9,405 పొదుపు గ్రూపుల్లో 45,671 మంది మహిళా రైతుల సభ్యత్వం
- పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్నది 53,827.87 ఎకరాలు
- జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి వనితలు

కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో ఇల్లాలిది కీలక పాత్ర. రుచికరమైన భోజనమే కాదు.. పోషక విలువ ఉన్న పదార్థాలను శుచిగా వండి ఇంటిల్లిపాదినీ పుష్టిగా, దృఢంగా ఉంచేదీ మహిళే. ఇక నేటి మహిళలైతే మరో అడుగు ముందుకేసి విషపూరిత ఆహార పదార్థాల నుంచి కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు ప్రకృతి సాగుకు నడుంబిగించారు. ఒకవైపు భూసారాన్ని పెంచుతూ.. మరోవైపు అధిక దిగుబడులు సాధిస్తూ వనితలు అనితర సేద్యం చేస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. – ఆళ్లగడ్డ



పూర్తి స్థాయి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తున్న మహిళా రైతు భవాని

వినియోగిస్తున్న పద్ధతులు

- ➤ వృక్ష జంతు సంబంధమైన కషాయాల వాడకం.
- ➤ మిత్ర పురుగులు, చీడపీడలను సంతులనం చేయడం.
- ➤ భూమి ఆరోగ్యాన్ని పచ్చిరొట్ట, నాడెప్ కంపోస్టు విధానాల ద్వారా పెంపొందించి కాపాడటం.
- ➤ నేలల్లో చౌడును తగ్గించి.. సూక్ష్మ పోషకాల లభ్యతను పెంచడం.
- ➤ కృత్రిమ రసాయన ఎరువులు, పురుగు మందులు మొదట్లో తగ్గిస్తూ తర్వాత పూర్తిగా నిలిపేయడం.
- ➤ భూముల్లో జీవ పదార్థం వృద్ధిచెంది పోషకాల పెంపునకు చర్యలు పాటించడం.
- ➤ పంటల్లో వైవిధ్యం పాటించి, పలురకాలు పంటలు సాగు చేయడం.

జిల్లా ప్రకృతి వ్యసాయ విభాగం మహిళలకు ప్రకృతి వ్యసాయ సాగుపై అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగా ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా మహిళా రైతులను గుర్తించి గ్రామాల వారీగా అవగాహన కల్పించి, ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు ఏకైక మార్గమని నమ్ముతున్న మహిళా రైతులు ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. కనీసం ప్రతి మహిళ తన ఇంటికి అవసరమైన కూరగాయలు, ఆకు కూరలైనా పెరట్లో ప్రకృతి వ్యసాయసాగు విధానంలో పండించుకునే విధంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, నిపుణులు, అధికారుల కృషి.. ఫలించి గత నాలుగేళ్లలో జిల్లాలో ప్రకృతి సాగు అంచనాకు మించి విస్తరించింది. ఈ తరహాలో సాగుచేసి నాణ్యమైన దిగుబడులు సాధించడంతో పాటు మద్దతు ధర పొందుతూ సత్ఫలితాలు సాధిస్తున్నారు.

రసాయనాల తగ్గింపే లక్ష్యం..

ప్రస్తుతం వ్యవసాయంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయనాల వల్ల భూమిలోని సేంద్రియధాతు, భూమికి మేలుచేసే కర్బన పదార్థాలు సైతం కనుమరుగవుతున్నాయి. విచక్షణ రహితంగా సస్యరక్షణ మందులను పిచికారీ చేయడంతో పండించిన పంటలు కలుషితమవడం, నేలల్లో పరాన్న జీవులు నశించిపోవడం, పర్యావరణానికి హాని, మానవాళి అనారోగ్యానికి కారణమవుతున్నాయి. సాగులో వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందుల అవశేషాలు ఆహారధాన్యాలలో ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్‌బీకేల ద్వారా..

ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కూడా వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో సిబ్బంది ఆర్‌బీకేల్లోనే కర్షకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఘణ, ద్రవ, జీవామృతాలు, నీమాత్రం, బ్రహ్మాత్రం, అగ్నాత్రం, బీజామృతాలతో పాటు అనేకర రకాల క్రిమి సంహారక కషాయాలు తయారు చేసుకునే విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అందుబాటులో ఎన్‌పీఎం షాపులు

ప్రకృతి వ్యవసాయం సాగుపై ఆసక్తి ఉన్నా జీవామృతాలు, కషాయాలు, జీవ ఎరువులు సొంతంగా తయారు చేసుకోవాలంటే అనేక మంది ఇబ్బంది పడుతుంటారు. అటువంటి వారి కోసం ఒక్కో మండలంలో 5 నుంచి 10 వరకు ఎన్‌పీఎం (నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) షాపులను ఆ శాఖ ఏర్పాటు చేసింది. దీంతో రైతులకు అవసరమైన కషాయాలు, జీవ ఎరువులు సులభంగా అందడంతో పాటు వీటిని తయారు చేసేవారికి ఆదాయం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రకృతి ఉత్పత్తులకు అధిక మద్దతు ధర

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో సాగు చేసిన సాగుదారులు, పంటల వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ప్రత్యేకంగా నమోదు చేస్తారు. వీరి ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ ద్వారా బహిరంగ మార్కెట్ కన్నా 10 నుంచి 15 శాతం అధిక మద్దతు ధర చెల్లించేలా ప్రకృతి వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆమేరకు రైతులతో ముందస్తుగా ఒప్పందం చేసుకుని ఉత్పత్తులను సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ

జీవన శైలి మారడంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఫలితంగా సేంద్రియ ఉత్పత్తుల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రకృతి సిద్ధంగా పండించిన ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది. వినియోగదారులే రైతు వద్దకు వచ్చి అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.



ఇక్కడ పొలంలో ఘన జీవామృతం తయారు చేస్తున్న మహిళా రైతు భవాని. మూడేళ్లుగా ఆరు ఎకరాల్లో 2 ఎకరాలు శ్రీవరి, 4 ఎకరాల్లో నిమ్మ, నిమ్మలో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు అంతర్ పంటలుగా సాగు చేస్తోంది. గతంలో ఎకరా వరి సాగుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అయ్యేది. ఇప్పుడు రూ.21 వేలు మాత్రమే అవుతోంది. దిగుబడి 40 బస్తాలు వస్తోంది. ఏపీసీఎన్‌ఎఫ్ వారు వరికి రూ.1,700 మద్దతు ధర ఇస్తామని అగ్రిమెంట్ చేసుకున్నారు. ప్రైవేటుగా రూ.2,000కు ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేసి తీసుకుపోతున్నారు. ఆదాయం మిగులు బాటు అవుతుందని, అలాగే నాణ్యమైన ఆహారం తింటున్నామన్న సంతృప్తి ఉందని భవాని ఆనందం వ్యక్తం చేస్తోంది.



ఇక్కడ బీజామృతం తయారు చేస్తున్న మహిళా రైతు రమణమ్మ. చాగలమర్రి మండలం చిన్నవంగలి. ఈమె 15 ఏళ్ల నుంచి భర్తతో కలిసి పలు రకాల తోటలు సాగుచేస్తోంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడి ఒక్కోసారి పెట్టుబడికూడా రాక అవస్థలు పడేవారు. నాలుగేళ్ల నుంచి ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది గ్రామానికి వచ్చి జీరో బడ్జెట్ పెట్టుబడిపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వడంతో ముందుగా రెండు ఎకరాల్లో ఈ పద్ధతిపై సాగు ప్రారంభించారు. మంచి దిగుబడి రావడం, ధర కూడా అధికంగా ఇచ్చి కొనుగోలు చేయడంతో వారికున్న మొత్తం 6 ఎకరాల్లో ఈ పద్ధతిలోనే పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో ప్రధాన పంట పసుపు, అంతర పంట బొప్పాయి, మిగతా పొలంలో ఐదు అంచల విధానంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేశారు. 'దిగుబడి బాగా వస్తోంది. నాణ్యత బాగా ఉండటంతో మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. కొందరు ఇంటి వద్దకే వచ్చి కొనుక్కొని పోతున్నారు. అన్ని ఖర్చులు పోనూ రూ.5 లక్షల దాకా ఆదాయం రావచ్చు' అని రమణమ్మ చెబుతోంది.

ఉద్యమంగా ప్రకృతి వ్యవసాయం



మూడేళ్లుగా ప్రకృతి దిగుబడులు కొనుగోలు చేసేందుకు టీటీడీతో పాటు మరో 11 ప్రధాన దేవస్థానాలు ముందుకు వచ్చాయి. ఇది ప్రకృతి వ్యవసాయ సాగుదారులకు మంచి గుర్తింపు. సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రణాళికబద్ధగా ముందుకెళ్తున్నాం. ఉద్యమంలా ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం

– నరేంద్రారెడ్డి, ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా అధికారి, నంద్యాల



రైతులకు విక్రయించేందుకు అవసరమైన క్రిమిసంహారక కషాయాల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

జిల్లాలో సబ్‌డివిజన్‌ల వారీగా ప్రకృతి సాగు వివరాలు

డివిజన్	పొదుపు సంఘాలు	టార్గెట్ రైతులు	టార్గెట్ విస్తీర్ణం ఎకరాల్లో	పూర్తి స్థాయి ప్రకృతి సాగు రైతులు	పూర్తి స్థాయి ప్రకృతి సాగు విస్తీర్ణం	పాక్షిక ప్రకృతి సాగు రైతులు	పాక్షిక ప్రకృతి సాగు విస్తీర్ణం
ఆళ్లగడ్డ	1,209	9,796	12,004	6,937	7,979	2,112	2,352
ఆత్మకూరు	1,186	7,484	9,029	4,151	4,377	550	644
డోన్	2,366	19,450	2,4312.5	16,184	20,126.85	4,328	4,852
కోవెలకుంట్ల	606	3,949	4,936.25	3,646	4,246.5	856	951
నందికొట్కూరు	1,420	6,454	7,917.5	3,688	4,056.5	764	726
నంద్యాల	2,618	15,245	18,527.75	11,065	13,042.02	2,455	2,678
మొత్తం	9,405	62,378	76,727	45,671	53,827.87	11,065	12,203



దీబగుంట్లలో మహిళలు ఏటీఎం పద్ధతిలో సాగుచేసిన సేంద్రియ పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

కృష్ణమ్మ పరుగులు

- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే జయసూర్య, ఎస్ఈ వెంకటరామయ్య తదితరులు



ఎస్సార్‌ఎంసీ కాల్వలో దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణా జలాలు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణమ్మ దిగువకు పరుగులు తీస్తోంది. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 864.00 అడుగులకు చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ రాజకుమారి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, పోతిరెడ్డిపాడు ఎస్ఈ వెంకటరామయ్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మలమ్మ పోతిరెడ్డిపాడు ఐదో గేటు స్విచ్ ఆన్ చేసి దిగువకు కృష్ణా జలాలను విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా జలాలు ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి పరుగులు తీశాయి. ఈ సందర్భంగా కృష్ణమ్మకు కలెక్టర్ రాజకుమారి వాయనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాల్లోని రిజర్వాయర్లు, ప్రాజెక్టులకు పోతిరెడ్డిపాడు కీలకమన్నారు. శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం పెరిగే కొద్ది పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను పెంచడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీరు వృథా కాకుండా సకాలంలో రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాలు రైతులకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణానదిపై తీగల వంతెన వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, దాని స్థానంలో బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే రాయలసీమ రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం వల్ల 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.దాసు, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ నూర్జహాన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, ఈఈలు పార్థసారథి, శంకర్‌రెడ్డి, డీఈ నాగేంద్రకుమార్, మురళీకృష్ణ, ఏఈలు విష్ణువర్ధన్ రెడ్డి, తిమ్మారెడ్డి, దేవేంద్ర, మధుసూదన్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గేట్ల ద్వారా నీటివిడుదల

ఉదయం ఒక గేటు ఎత్తి 2 వేల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి శ్రీశైలానికి ఇన్‌ఫ్లో భారీగా పెరగడంతో మరో ఐదు గేట్లు అడుగు మేర ఎత్తి 15 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి విడుదల చేశారు. ఈ నీటిని బానకచర్ల నీటిని యంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 9 వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు. శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం పెరిగేకొద్ది పోతిరెడ్డిపాడు నుంచి నీటివిడుదలను పెంచే అవకాశాలున్నాయని తెలిపారు.

శ్రీశైలం వైపు వే'గంగా'

- పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర నది
- టీబీ డ్యాం నుంచి 1.17 లక్షల క్యూసెక్కులు నీటి విడుదల
- నదితీర గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేసిన రెవెన్యూ అధికారులు

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీశైలం వైపు వరద జలాలు పరుగులు తీస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి భారీగా లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అన్ని గేట్లు ఎత్తివేసి 1.17 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆ నీరు జిల్లాకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తీర గ్రామాల్లో ప్రజలు నదివైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బ్యారేజీ (సుంకేసుల బ్యారేజీ) నుంచి 26 గేట్లు రెండు మీటర్లు పైకెత్తి నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శనివారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేశారు. తొలుత ఐదు వేల క్యూసెక్కులను విడుదల చేయగా.. మధ్యాహ్నానికి 10 వేలు, రాత్రి 15 వేల క్యూసెక్కులకు పెంచారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేస్తున్న నీటిని ముందుగా తాగునీటి అవసరాల కోసం వినియోగించనున్నారు. వెలుగోడులో 16.95, గోరుకల్లులో 12.5 టీఎంసీల నీటిని నింపిన తరువాతే ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ రెండు రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో నింపేందుకు ప్రస్తుతం పోతిరెడ్డిపాడుకు వస్తున్న నీటితో నెల రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే పోతిరెడ్డిపాడు నుంచి 44 వేల క్యూసెక్కులు విడుదల చేస్తేనే తక్కువ రోజుల్లోనే రిజర్వాయర్లను నింప వచ్చని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.



సుంకేసుల డ్యామ్ నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలంలో 129 టీఎంసీల నీరు

కృష్ణ, తుంగభద్ర నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బ్యారేజ్ (సుంకేసుల బ్యారేజ్) నుంచి 1,01,100 క్యూసెక్కులు, ప్రియదర్శిని జూరాల నుంచి 2,56,068 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటితో ప్రస్తుతం రిజర్వాయర్ నీటి మట్టం 867 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 129 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఏపీ, తెలంగాణ జెన్‌కోలు పోటీపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 62,262 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నాయి.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించండి



జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రిస్టిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఆసక్తి గల రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు వ్యవసాయ సంబంధిత రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కల్పించే దిశగా కోర్సులను గుర్తించాలన్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద పరిశ్రమలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నైపుణ్య అభివృద్ధి విధివిధానాలను జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీవీ ప్రతాపరెడ్డికి సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్‌డీఏ పీడీ కల్యాణి, ఉపాధి కల్పనాధికారి దీప్తి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందపల్లెకు సోషల్ వెల్ఫేర్ పాఠశాల మంజూరు



స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న డీఈఓ

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లెకు సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాల మంజూరైందని డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థల సేకరణ చేస్తామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ప్రారంభమవుతుందన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు మొదలవుతాయన్నారు. మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టాలన్నారు. చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని, విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడంతో వర్షాలు కురవడంలేదన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి రానున్న పరీక్షల్లో మంచి ఫలితాలు తెచ్చుకోవాలని విద్యార్థులు, టీచర్లకు సూచించారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఏకో క్లబ్‌ను ప్రారంభించారు. తాగునీరు, విద్యుత్ ఆదా, మొక్కల పోషణపై దృష్టి పెట్టాలని క్లబ్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి లలిత కుమారి, నంద్యాల, ఆళ్లగడ్డ అటవీ సామాజిక విభాగం రేంజర్ ప్రసాదు, ఎంఈఓలు శంకరప్రసాదు, నాగార్జునరెడ్డి, హెచ్‌ఎంలు ఇశ్రత్ బేగం, విజయకుమార్, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకుడు బీసీ ఫిదా, టీచర్లు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో నేర నియంత్రణ

బొమ్మలసత్రం: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన చట్టాలతో నేరాలను మరింతగా నియంత్రించవచ్చునని డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. నూతన చట్టాలపై పోలీసు అధికారులకు శనివారం స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహితను ప్రవేశపెట్టిందన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష అధినీయంను నూతనంగా అమలు చేసిందని వివరించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సీఐలు సూర్యమౌళి, నరసింహులు, రాజారెడ్డి, దస్తగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లమల టై'గర్'



అందంలోనూ.. బలంలోనూ పెద్ద పులికి సాటిరాగల మరో జంతువు భూమిపై కనిపించదు. అది నడుస్తుంటే రాజసం తొణికిసలాడుతుంది. భూమిపై అంతరించి పోతున్న జాతుల జాబితాలో చేరి రెడ్ డాటా బుక్‌లో నమోదు అయిన అపురూపమైన పులి నల్లమల ప్రాంతంలో మీసం మెలేస్తోంది. తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పర్యావరణానికి రక్షణగా నిలుస్తోంది. అటవీ అధికారులు తీసుకుంటున్న చర్యలతో నల్లమల 'పులి'కిస్తోంది. రేపు (సోమవారం) అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- పులుల ఆవాసంగా నల్లమల
- ఎన్‌ఎస్‌టీఆర్‌లో పులి సంరక్షణకు ప్రత్యేక సాయుధ బలగం
- ఆహార జంతువుల పెంపునకు కృషి
- రేపు అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం



ఆత్మకూరురూరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న నల్లమల అడవులు పులి సంరక్షణకు ఆశ్రయ దుర్గంగా మారాయి. పులి ప్రవర్ధనానికి ఈ ప్రాంతం అత్యంత అనుకూల పర్యావరణాన్ని కలిగి ఉంది. 2022 లెక్కల ప్రకారంలో వందకు పైగా పులులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్)కు విస్తరణ పులుల అభయారణ్యంగా ఉంటున్న గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణి అభయారణ్యంలో కూడా పులులు క్రమేపి విస్తరిస్తూ వైఎస్సార్ జిల్లా వరకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా నల్లమలలోని ఆత్మకూరు, మార్కాపురం, నాగార్జున సాగర్ అటవీ డివిజన్‌లు, తెలంగాణాలోని అచ్చంపేట అటవీ డివిజన్‌లలో విస్తరించిన నాగార్జున సాగర్ - శ్రీశైలం పులుల అభయారణ్యంలో సిబ్బంది పర్యవేక్షణ, మానవ వనరులను అత్యంత ప్రతిభావంతంగా వినియోగించుకోవడం వంటి అంశాల కారణంగా ఇక్కడ పులులు క్రమేపి పెరుగుతున్నాయి. 2014లో ఈ అంశాలపై ఎన్‌టీసీఏ అత్యున్నత ప్రతిభా అవార్డును అప్పటి ఎన్‌ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ రాహుల్ పాండే అందుకున్నారు. ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలో 2014-15లో పులుల గణన చేపట్టగా 37 అని తేలింది. పదేళ్లలో ఆ సంఖ్య క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం 100కు పైగా చేరినట్లు సమాచారం. విస్తీర్ణం రీత్యా రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న నాగార్జున సాగర్ శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం దేశంలోనే 54 అభయారణ్యాల్లో అతి పెద్దది.

పులి ఆహార జంతువుల నిష్పత్తి పెంచేందుకు యత్నాలు..

నల్లమల పరిధిలోని అడవుల్లో పులికి ఆహార జంతువులైన జింకలు, దుప్పులు, కణుతులు, కొండగొర్రె, మనుబోతు, అడవి పంది వంటి జంతువులు పుష్కలంగానే ఉన్నాయి. అయినప్పటికీ పులి ఆహర జంతువుల సంఖ్యను పెంచేందుకు అటవీ అధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు. కాకినాడ సమీపంలోని నాగార్జున ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ కర్మాగారం గ్రీన్ కవర్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో పెంచ బడుతునన్న వన్యప్రాణులను నల్లమలకు తరలించారు. సుమారు 300 దుప్పులు, 30 వరకు కణుతులను నల్లమలలోని పచ్చర్ల, మార్కాపురం డివిజన్‌లోని పెద్దమంతనాలలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంచారు. ఇవి దట్టమైన అటవీ వాతావరణానికి అలవాటు పడగానే అడవుల్లోకి స్వేచ్ఛగా తిరిగేందుకు వదలనున్నారు. వీటిని వన్యప్రాణి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. సున్నిపెంటలో కూడా ఎన్‌క్లోజర్‌లలో ఉన్న వివిధ వన్యప్రాణులను కూడా అడవుల్లో వదలనున్నారు.

సంరక్షణకు ఎస్‌టీఎఫ్ బలగాలు

నాగార్జునసాగర్ - శ్రీశైలం (ఎన్‌ఎస్‌టీఆర్) పులుల అభయారణ్యంలో పులుల సంరక్షణ కోసం ప్రత్యేక సాయుధ బలగాల నియామకం జరగబోతోంది. స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)గా పిలువబడే ఈ బలగాలలో 15 మంది ప్రత్యేక శిక్షణ పొందిన కమెండోలు ఉంటారు. జాతీయ పులుల సంరక్షణ సాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి పులుల అభయారణ్యంలోను పులి వేటగాళ్ల నియంత్రణకు సాయుధ బలగం తప్పనిసరి. దేశంలోనే విస్తీర్ణంలో అత్యంత పెద్దదైన ఎన్‌ఎస్‌టీఆర్‌లో ఇంతవరకు సాయుధ సంరక్షణ బలగాలు లేవు. అయితే ఈ లోపాన్ని గ్రహించిన ఎఫ్‌డీపీటీ బీఎల్‌ఎస్ మూర్తి కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు ప్రతిపాదనలు పంపారు. మిలటరీ, పారామిలటరీ ఫోర్స్‌ల నుంచి ఉద్యోగ విరమణ చేసిన సైనికుల నుంచి అటవీ శాఖ తమ అంచనాల మేరకు అర్హత కలిగిన వారిని అటవీ శాఖ రిక్రూట్ చేసుకునే అవకాశాలున్నాయి. ఈ సాయుధ బృందానికి వాహన సౌకర్యంతో పాటు వేటగాళ్ల పని పట్టేందుకు అవసరమైన అన్ని రకాల సాంకేతిక, సమాచార సామగ్రిని అందుబాటులో ఉంచనున్నారు. ఈ క్రమంలోనే ఏనుగులతో అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలో పులుల పెరుగుదల ఇలా..

సంవత్సరం	పులుల సంఖ్య
2014-15	37
2015-16	40
2016-17	46
2017-18	46
2018-19	47
2019-20	63
2020-21	70

(2022లో జరిగిన జాతీయ పెద్దపులుల గణన అంచనా ప్రకారం ఎన్‌ఎస్‌టీఆర్, గుండ్లబ్రహ్మేశ్వరంలో మొత్తం 100 తక్కువ కాకుండా పెద్ద పులులు ఉన్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. అధికారికంగా ఇంకా వెల్లడి కాలేదు).

తల్లికి దూరమైన పులి పిల్లల వన ప్రవేశానికి సర్వం సిద్ధం..

దాదాపు ఏడాది క్రితం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని పెద్ద గుమ్మడాపురం పరిధిలో తల్లికి దూరమై గ్రామంలోకి వచ్చిన పులి పిల్లలను అటవీ అధికారులు సంరక్షించి తిరుపతి జూకు తరలించారు. వాటిని ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలో ఉంచి పెంచుతున్న సంగతి తెలిసిందే. అక్కడే వాటికి ఆహార జంతువులను వేటాడడంలో తర్ఫీదును కూడా మొదలు పెట్టారు. ఈ పులి పిల్లలు అటవీ వాతావరణానికి అలవాటు పడేందుకు మార్కాపురం డివిజన్‌లో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని గుర్తించి అక్కడ అన్ని ఏర్పాట్లు చేసి ఉంచారు. త్వరలో వాటిని ఈ అటవీ ఎన్ క్లోజర్‌కు తరలించనున్నారు. అక్కడ అంచెలంచలుగా ఈ కూనలు పూర్తి స్థాయిలో అడవిలోకి వెళ్లి స్వతంత్రంగా జీవించగలిగేలా చేయనున్నారు.

పులులు పెరుగుతున్నాయి



నల్లమలలో పెద్ద పులుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. కొన్ని భద్రతా చర్యల్లో భాగంగా వాటి సంఖ్యను తరుచు ప్రకటించి ప్రచారం చేయడం మంచిది కాదు. వెయ్యి పులులను అకామిడేట్ చేయగల నల్లమలలో పులి ఆహార జంతువులను ఆ నిష్పత్తిలో పెంచాల్సి ఉంది. దేశంలోనే విస్తీర్ణంలోఅతి పెద్దదైన నాగార్జున సాగర్ -శ్రీశైలం పులుల అభయారణ్యం పులుల సంఖ్యలో కూడా దేశంలోనే పెద్దది కావాలన్న ఆకాంక్షలను విజయవంతం చేసేందుకు అటవీ సమీప గ్రామాల ప్రజల,మేధావుల, పాత్రికేయుల సహకారం ఆశిస్తున్నాము. – సాయిబాబా, డీడీ పీటీ, ఆత్మకూరు డివిజన్

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి

సాక్షి ఎఫెక్ట్



దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు తహసీల్దార్‌గా జిల్లా రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల విధుల్లో వచ్చిన తహసీల్దార్ చంద్రశేఖర్ ఆరు రోజుల క్రితం బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరికీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఎంసెట్, ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్‌కు వెళ్లే విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలపై సంతకాల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ సమస్యపై 'సంతకం చేసేవారేరీ?' అంటూ శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలకు డీటీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో దరఖాస్తుల్లో కదలిక వచ్చింది. నంద్యాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డి దరఖాస్తులపై సంతకాలు చేయడంలో బిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ: స్థానిక ఆల్ఫా ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన యోహాన్ (45) అనే వ్యక్తి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పెద్దాసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు హెల్ప్ డెస్క్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ట్రాన్స్‌జెండర్ల (లింగమార్పిడి చేయించుకున్నవారు) కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యలపై వీహెచ్‌ఎస్ సీడీసీ ప్రాజెక్టు ఆస్పైర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి కూడా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటాయన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ భాస్కర్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ట్రాన్స్ జెండర్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ముంబైలో రైలు ఢీకొని కోవెలకుంట్ల యువకుడి మృత్యువాత



రజనీకాంత్ (ఫైల్)

కోవెలకుంట్ల: రెండు రోజుల క్రితం ముంబైలో జరిగిన రైలు ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న రామసుబ్బయ్య, భ్రమరాంబ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రజనీకాంత్(24) ముంబైలో ఎంటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. తోటి స్నేహితులు కోవెలకుంట్లలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని శనివారం ఇంటికి తీసుకొచ్చారు. మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, తదితరులు యువకుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాముకాటుతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

మహానంది: పొలంలో వరినారు తీస్తుండగా పాముకాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు(50) పొలానికి వెళ్లి నారు తీస్తుండగా పాము కాటేసింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ముందుగా బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు శ్రీనివాసులును నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.